# సింగిల్ పేజీ కథలు

టీవీలో చిత్రలహరి వస్తోంది. సరిగ్గా అప్పుడే కాలింగ్ బెల్ రింగ్ అవ్వడంతో లేచివెళ్ళి తలుపుతీసింది శశికళ. ఎదురుగా మిస్టర్ అండ్ మిసెస్ రావు.

"ఓ..మీరా రండి రండి! ఏమిటీరోజు భార్యాభర్తలిద్దరూ ఈవెనింగ్‌వాక్‌కి బయలుదేరారా?" అంటూ చిరునవ్వుతో ఆహ్వానించింది.

రావుగారూ శశికళ భర్త వినయ్ ఇద్దరూ ఒకే ఆఫీసులో పనిచేస్తున్నారు. ఇద్దరు దాదాపు నడివయసున్న వారే. రావుగారికి పిల్లలులేరు. వినయ్ దంపతులకి పదేళ్ళ వయసు అమ్మాయి ఉంది. పేరు సంధ్య. ఇళ్ళు కూడా దగ్గర దగ్గర ఒకే కాలనీలోనే కావటంతో తరచూ ఒకళ్ళ ఇంటికి ఒకళ్ళు వెళ్లడం అలవాటే.

"అవునండీ మా ఆవిడకీ వొళ్ళు బొత్తిగా ఎక్సర్‌సైజ్ లేకుండా పోయింది. అందుకే బలవంతంగా లాక్కొచ్చాను మీ ఇంటికి. లేకపోతే ఆ ఒళ్ళు ఎలా తగ్గుతుంది చెప్పండి?" అంటూ తన గోడు వెళ్ళబోసుకున్నాడాయన. భర్త వంక చురచురా చూసింది భారతి.

కానీ రావుగారి బాధల్లా వాళ్ళ ఆవిడ లావుగా ఉండడమే కాదు. తను సన్నగా పీలగా ఉండడమే. చూసేవాళ్ళు ఎక్కడ నవ్వుకుంటారోనని ఆయన తెగ ఇదయిపోతూంటాడు. ఆయన దృష్టిలో వాళ్లిద్దరి జంట నార్మల్‌గా కనబడాలంటే రెండే ఉపాయాలున్నాయి. ఒకటి తనన్నా లావుకావాలి, లేక ఆవిడన్నా తగ్గాలి. తనకి ఒళ్ళు రావడానికి అన్ని ప్రయోగాలు చేసి విఫలుడైన ఆయన ఇక వాళ్ళ ఆవిడ ఒళ్ళు తగ్గడమే ఈ సమస్యకి పరిష్కారం అన్న తీర్మానానికి వచ్చేశారు. దాంతో ఇక ఆవిడని డైటింగ్ చేయి, ఎక్సర్‌సైజ్ చేయి అని ఒకటే పోరు, నస..కానీ ఆవిడ అంతకన్నా మొండిఘటం. భర్త మాటలు ఈ చెవిన విని ఆ చెవిన వదిలేయడం అలవాటు చేసుకుందావిడ.

అందుకని రావుగారు ఆవిడకి కోపం తెప్పించాలన్న ఉద్దేశ్యంతో నలుగురిలోనూ బాహాటంగానే ఆవిడని కామెంట్ చేయడం మొదలుపెట్టారు.

అలాగే ఈరోజు కూడా ఆయన మాటలు విని శశికళ "ఎందుకండీ పాపం ఆవిడని అలా టీజ్ చేస్తూ ఉంటారు? ఆవిడ ఏమంత లావుగా ఉన్నారని?" అంది నవ్వుతూ.

వాళ్ళిద్దరూ లోపలికి వచ్చాక వినయ్ విష్ చేశాడు. అంతా కలిసి సరదాగా చిత్రలహరి చూసాక రావుగారు, ఆయన భార్య భారతి వెళ్లడానికి లేచారు. అప్పుడే శశికళ "అగండాగండి అప్పుడే వెళ్లకండి. నేనీరోజు బోండాలు చేశాను. తినేసి వెళుదురుగానీ" అంది. వెంటనే రావుగారు "వద్దొద్దు మా ఆవిడ అసలే బోండాలా ఉంది. ఇంకా బోండాలు కూడా తింటే ఏమైనా ఉందా?" అన్నారు ఎగతాళిగా.

ఈ మాటలకి భారతి మొహం అప్రసన్నంగా మారిపోయింది. వెంటనే సీరియస్ అయిపోయి, రుసరుసలాడుతున్న ముఖంతో కోపంగా లేచి ఇంటికి వెళ్లిపోయింది

## డైటింగ్

వెనుకనించి శశికళ పిలుస్తున్నా వినిపించుకోకుండా.

ఆవిడ అలా వెళ్లడం చూసి చాలా నొచ్చుకున్నాడు



వినయ్.

"మీరలా అని ఉండవలసింది కాదు రావుగారూ! ఇటువంటి సున్నితమైన అంశాల్ని ఇలా ఓపెన్‌గా మాట్లాడితే ఎవ్వరైనా హర్ట్ అవుతారు" అన్నాడు.

"ఆవిడ అలా హర్ట్ అవ్వాలనే అన్నానండీ బాబూ. లేకపోతే ఎలాగండీ ఆవిడ పక్కన నడవాలంటే నాకు ఎంత సిగ్గేస్తోందో మీకెలా తెలుస్తుంది? ఈ దెబ్బతో చూస్కోండి మా ఆవిడ డైటింగ్ చేయడం మొదలుపెట్టకపోతే నా చెవులు కోయించుకుంటాను" అని ఓ సవాలు విసిరాడు.

* * *

ఆ తరువాత నెలరోజుల వరకూ రావుగారి దంపతులని కలుసుకోలేకపోయారు వినయ్ దంపతులు. టీవీలో చిత్రలహరి చూసిన మరునాడే వినయ్ తల్లికి సీరియస్‌గా ఉంది వెంటనే బయలుదేరి రమ్మని టెలిగ్రాం అందగానే వినయ్ కుటుంబంతో సహా వైజాగ్ బయలుదేరి వెళ్లడమే అందుకు కారణం. తల్లికి కొద్దిగా స్వస్థత చిక్కేవరకూ అక్కడే ఉండి వచ్చేటప్పటికి నెలరోజులు పట్టింది.

ఊరినించి వచ్చిన రెండవరోజు రావుగారింటికి వెళ్లారు వినయ్ దంపతులు. భారతిని చూసిన శశికళ, వినయ్‌లు తమ కళ్ళని తాము నమ్మలేకపోయారు. భారతి చాలావరకూ తగ్గిపోయింది. శశికళ ఉండబట్టలేక భారతిని అడిగేసింది ఎలా తగ్గారని...అప్పుడు చెప్పింది భారతి "నేను మా ఆయన టీజింగ్‌ని భరించలేక స్లిమ్ ఎలా అవ్వాలా అని చాలారోజులుగా ఆలోచిస్తూనే ఉన్నాను. ఈ లోపల అదిగో ఆ రోజు మీ ఇంట్లో నన్ను బోండాలా ఉన్నానని అన్నప్పుడు నాకు చాలా అవమానం అనిపించింది. తల కొట్టేసినట్టయింది. కానీ ఆరోజు మావారు అలా అనడం మంచిదే అయింది. ఎందుకంటే ఆ అవమానం భరించలేక నేను ఆ మరునాడే ఒక స్విమ్మింగ్ సెంటర్‌లో జాయిన్ అయ్యాను. ఆరోజునుంచే పూర్తి డైటింగ్ పాటిస్తున్నాను. వాళ్ళు రోజుకొక చార్ట్ ఇస్తారు. దాని ప్రకారం ఆహారం తీసుకోవాలి. ఆరునెలల్లో నా బరువుని 75 కిలోలనించి 52కిలోలకి తీసుకొస్తామని గ్యారంటీ కూడా ఇచ్చారండీ" అంది ఎంతో ఆనందంగా.

ఆరునెలలు ఇట్టే గడిచిపోయాయి. ఇప్పుడు మిసెస్‌రావు పర్సనాలిటీయే మారిపోయింది. మనిషి విల్‌పవర్‌తో సాధించలేనిదంటూ ఏదీ లేదనడానికి ఆవిడే నిదర్శనం. ఇప్పుడావిడ ఎంతో స్లిమ్‌గానూ, ట్రిమ్‌గానూ ఉండడమేకాకుండా ఎంతో అందంగా కూడా ఉండడం శశికళ గమనించింది. కాకపోతే తన స్లిమ్‌నెస్‌ని కాపాడుకోవడం కోసం ఆవిడ తిండినే త్యాగం చేయవలసి వచ్చింది. అన్నీ లిమిటెడ్‌గానే తీసుకోవాలి. ప్రతీదీ క్యాలరీలతో కొలుచుకుని తినాలి. కూల్‌డ్రింక్ కూడా ఎక్కువగా తీసుకోవడానికి వీలులేదు. ఆవిడ సెల్ఫ్ కంట్రోల్‌కి, విల్‌పవర్‌కీ మాత్రం మనస్సులో జోహార్లు అర్పించకుండా ఉండలేకపోయింది శశికళ.

వాళ్ల అంచనా ప్రకారం ఇప్పుడు మిస్టర్ రావుగారు చాలా హేపీగా ఉండాలి. అదే అన్నారు వాళ్ళు ఒకరోజు ఆయనతో "ఏమండీ మీ ఆవిడ అంత కష్టపడి మీ కోసమని డైటింగ్ చేసి స్లిమ్ అయ్యారు కదా మీరు ఆనందంగా ఉన్నారా?" అన్నాడు వినయ్.

"ఆ..ఏం స్లిమ్మోలెండి. తిండీ లేదు తిప్పలూ లేవు. కొంతమందికంతే. అన్నీ ఉండికూడా అనుభవించలేరు. శుభ్రంగా తిండిక్కూడా నోచుకోని లైఫ్ కూడా లైఫేనా?" అన్నాడాయన ఎంతో నిర్లిప్తంగా.

ఆ మాటలకు శశికళ, వినయ్‌లు ఆశ్చర్యంతో నోరెళ్ళబెట్టారు.

-మాధవపెద్ది ఉష (హైదరాబాద్)